క్లుప్తంగా

పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రంగానాయక్



మాచర్ల రూరల్: పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో ఎంపిక చేసిన జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆశయాలకనుగుణంగా పనిచేస్తానని రమావత్ రంగానాయక్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో పీఆర్కేని కలిసి కృతజ్ఞతలు తెలిపి ఆయన మాట్లాడారు. గిరిజన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామని పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి పోరాటాన్ని విజయవంతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతునాయక్, జెడ్పీటీసీ సభ్యుడు మండ్లి పెద మల్లుస్వామి, మండల నాయకులు బూడిద శ్రీనివాసరావు, పోతురెడ్డి కోటిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు సత్వర సేవలు అందించాలి

ఎంపీడీవో గౌసియాబేగం

గురజాల : ప్రజలకు సత్వర సేవలు అందించాలని ఎంపీడీవో గౌసియా బేగం సచివాలయ సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో సచివాలయాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు సత్వర సేవలు అందించే విధంగా చూడాలన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు.

ద్విచక్ర వాహనం ధ్వంసం చేసిన దుండగులు



వెల్దుర్తి: మండలంలోని కొత్తపుల్లారెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ కేతావత్ పాండు నాయక్ ద్విచక్ర వాహనాన్ని అర్ధరాత్రి సమయంలో దుండగులు తీసుకెళ్లి ధ్వంసం చేసిన ఘటన గురువారం రాత్రి జరిగింది. పాండు నాయక్ తన ఇంటి వద్ద ద్విచక్ర వాహనాన్ని ఉంచి ఇంట్లో నిద్రపోతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆ ద్విచక్ర వాహనాన్ని అపహరించి ఊరికి కి.మీ దూరంలోని అటవీ ప్రాంతంలో ద్విచక్ర వాహనాన్ని రాళ్లతో పగులగొట్టారు. పాండు నాయక్ ఉదయాన్నే ఇంటి ముందు ద్విచక్ర వాహనం కనబడకపోవటంతో వెతకగా అటవీ ప్రాంతంలో వాహనాన్ని ధ్వంసం చేసినట్లు గుర్తించారు. పాత కక్షలు మనసులో పెట్టుకొని ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పాండు నాయక్ అన్నారు. ఈ విషయంపై పాండు నాయక్ వెల్దుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

దాచేపల్లి : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. నగర పంచాయతీ పరిధిలోని నడికుడికి చెందిన ఉప్పు వెంకటేశ్వర్లు(43) ఈ నెల 12వ తేదిన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నడికుడికి చెందిన వెంకటేశ్వర్లు ఉపాధి నిమిత్తం గురజాలలో నివాసం ఉంటున్నాడు. నడికుడిలోని బంధువుల ఇంటి వద్దకు ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగిపయనమయ్యాడు. నడికుడి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి దాటిన తరువాత ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. స్థానిక పోలీసులకు మృతుడు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

నేడు రక్తదాన శిబిరం

మాచర్ల: పట్టణంలో స్వర్గీయ ఎన్టీ రామారావు వర్ధంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో శనివారం ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి, అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో పండ్లు, రొట్టెలు రోగులకు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

చోరీ ఘటనలపై దర్యాప్తు ముమ్మరం

- అన్ని కోణాల్లో పరిశీలిస్తున్న పోలీసులు
- నిందితులను పట్టుకునేందుకు చర్యలు



ఓ ఇంటిలో దొంగల ముఠా చెల్లాచెదురుగా వేసిన బట్టలు

గురజాల : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగల ముఠా ఈ నెల 15వ తేదీన తెల్లవారుజామున స్వైర విహారం చేసింది. గురజాల, దాచేపల్లి మండలాల్లో ఒక్క రోజులోనే 15 ఇళ్లలో తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి చొరబడి ఇంటిలోని డబ్బులు, బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఒకే రోజు గంటల వ్యవధిలో ఈ ముఠా రెండు మండలాల్లో 15 ఇళ్లను కొల్లగొట్టింది. ఈ కేసులను పోలీసులు సవాల్‌గా తీసుకుని నిందితులను పట్టుకునేందుకు చోరీ ఘటనలపై దర్యాప్తును ముమ్మరం చేశారు. దొంగల ముఠా ఈ నెల 8వ తేదీ నుంచి ఇంటికి తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేయడం మొదలుపెట్టారు.

అన్ని కోణాల్లో పరిశీలన

పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గురజాల డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో సీఐలు ఆవుల భాస్కర్, పి.భాస్కర్‌లు దర్యాప్తును ముమ్మరం చేశారు. దొంగల ముఠా ఎప్పటి నుంచి పల్నాడు ప్రాంతంలో సంచరించింది. ఎవరి సహాయంతోనైనా ఇక్కడకు వచ్చారా..? అన్న కోణాల్లో పరిశీలిస్తున్నారు. ఈ విధంగా గంటల వ్యవధిలోనే ఇన్ని ఇళ్లను కొల్లగొట్టడంలో ఎంతమంది దొంగలు పాల్గొన్నారు అన్న విషయాలను పరిశీలిస్తున్నారు. క్లూస్ టీం ఇచ్చిన ఆధారాలను బట్టి ఎంత మంది పాల్గొని ఉంటారు అన్న వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

రెక్కీ నిర్వహించి దొంగతనమా..?

దొంగల ముఠా ఉదయం వేళ రెక్కీ నిర్వహించి ఇళ్లకు తాళం వేసిన గృహాలను లక్ష్యంగా చేసుకుని ఒకటికి రెండు మార్లు రెక్కీ నిర్వహించి నిశితంగా పరిశీలించి దొంగతనం చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. దొంగతనానికి నాలుగు రోజులు ముందు ఆశ్రమం నిర్వహిస్తున్నాం చందాలు ఇవ్వాలని కొంత మంది ఆ ప్రాంతాల్లో సంచరించినట్లు సమాచారం. దొంగల ముఠా దొంగతనం చేయు సమయంలో స్పోర్ట్స్ బైకులు వాడినట్లు తెలియవస్తుంది. తెలంగాణకు చెందిన వారే ఈ దొంగతనంలో పాల్గొన్నట్లు సమాచారం.

ప్రత్యేక బృందాల ఏర్పాటు



దొంగల ముఠాను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశాం. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసులు అదే పనిలో నిమగ్నమయ్యారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగిన వారు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. దొంగతనాలు జరుగకుండా పోలీసులకు ప్రజలు కూడా సహకరించాలి. త్వరలో నిందితులను పట్టుకుంటాం.

– జగదీష్, డీఎస్పీ, గురజాల

గ్రామాలలో సదరం పత్రాల తనిఖీ



ధ్రువ పత్రాలను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో 19 మంది పింఛన్‌దారుల సదరం పత్రాలను శుక్రవారం వైద్యాధికారుల బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ ధ్రువ పత్రాలతో పింఛన్ పొందుతున్నట్లు అనేక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వైద్యాధికారులతో గ్రామాలలో పింఛన్‌దారుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించే కార్యక్రమాన్ని చేపట్టింది. మానసిక, శారీరక అంగవైకల్యం లేకపోయినప్పటికీ కొందరు దళారుల ప్రమేయంతో సదరం పత్రాలను పొంది ప్రభుత్వం సామాజిక భద్రత పథకం కింద అందజేస్తున్న పింఛన్‌లు తీసుకుంటునట్లు ప్రభుత్వం భావించింది. మండలంలోని మంచికల్లు గ్రామంలో 7, రెంటచింతలలో-6, తుమ్మకోట-2, మిట్టగుడిపాడు, పశర్లపాడు, మల్లవరం, పాలువాయిగేటు గ్రామాలలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 19 మందికి సంబంధించిన పత్రాలను పూర్తి స్థాయిలో వైద్యాధికారులు పరిశీలించారు. ఈ తనిఖీ బృందంలో వైద్యులు గోపికృష్ణ, శ్రీనివాసరావు, స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఎంపీడీవో కె.సరోజిని దేవి, హెల్త్ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, వైద్య సిబ్బంది మహేష్ బాబు, దాసు, కార్యదర్శి అనంత కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కోతుల బెడదతో ఇక్కట్లు



విజయపురిసౌత్: కోతుల బెడదతో విజయపురిసౌత్ వాసులు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. గ్రామంలో కోతులు విపరీతంగా పెరగటంతో గతంలో రెండు సార్లు కోతులను పట్టి అడవిలో వదిలేశారు. గ్రామంలో ప్రతి ఇంట్లో చెట్లు ఎక్కువగా ఉంటాయి. దీంతో ఇతర ప్రాంతాలలో పట్టించిన కోతులను సైతం గ్రామ శివారులో వదిలిపెట్టడంతో తిరిగి మళ్లీ కోతుల సంఖ్య పెరిగిపోతోంది. కోతుల దాడిలో తరచూ గ్రామంలోని వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు గాయపడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే కోతులు ఎక్కడ దాడి చేస్తాయోనని భయపడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కోతుల బెడదను నివారించాలని పలువురు కోరుతున్నారు.

భక్తుల పాలిట కల్పవృక్షం.. మల్లాది వెంకన్న

- వేడుకగా 48వ ఆలయ వార్షికోత్సవం
- 22న కనుల పండువగా కల్యాణ మహోత్సవం
- తిరునాళ్లకు భారీగా ఏర్పాట్లు



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి



మల్లాది వేంకటేశ్వరస్వామి ఆలయం

అమరావతి: మల్లాది గ్రామంలో వేంచేసిన వట వృక్షాంతర్గత వేంకటేశ్వరుడు 48 వసంతాలుగా భక్తుల పాలిట కల్పవృక్షంగా పూజలందుకుంటున్నాడు. స్వామి వారు అవతరించిన సుదినం జనవరి 22న కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించనున్నారు. సంతానప్రాప్తి, దీర్ఘకాలిక వ్యాధులు, ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం, మానసిక ప్రశాంతత కావాల్సిన భక్తులు స్వామిని దర్శించి, ఆనందంగా జీవిస్తున్నారు. సత్తెనపల్లికి చెందిన ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యేలూరి మంగాయమ్మ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ.. చెట్టు పక్కనే పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని నిర్మించారు. 48వ వార్షికోత్సవ తిరునాళ్లను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు యేలూరి సీతారామయ్య, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. సీతారామయ్య శుక్రవారం మాట్లాడుతూ తాత్కాలిక క్యూ లైన్‌లు, ఉచిత ప్రసాదం, తాగునీరు, అన్నదానం, పారిశుద్ధ్య నిర్వహణ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ అర్చక స్వామి వినుకొండ శ్రీనివాసాచార్యులు ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరించారు. సోమవారం 108 బిందెల కృష్ణా నది జలాలతో స్వామికి అభిషేకం, 21న నూతన వస్త్రాలంకరణ సేవ, 22న సుప్రభాత సేవ, అర్చన, గో పూజ, సప్త హారతులు, స్వామివారికి తులసీదళ సేవ నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు పద్మావతి, ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామికి యాజ్ఞిక బ్రహ్మ పరుచూరి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు. అన్నమాచార్య కీర్తనలు, భజన, లలిత, విష్ణు సహస్ర నామ పారాయణం, కోలాటం వంటి కార్యక్రమాలు ఉన్నాయన్నారు. సాయంత్రం 6 గంటలకు పెదశేష వాహనంపై గ్రామోత్సవం, పవళింపు సేవ నిర్వహిస్తామన్నారు. ఈ కల్యాణోత్సవంలో భక్తులందరూ పాల్గొని, స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా కొండలు



వెల్దుర్తి: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా వెల్దుర్తికి చెందిన ఉడతల కొండలును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బి.రాజారావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉడతల కొండలు మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విభాగం అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఉడతల కొండలు నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



క్రోసూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా క్రోసూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న కంభంపాటి, హెచ్‌ఎంసీసీ యూత్ క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. మొత్తం 8 జట్లు పాల్గొనగా జీఆర్ గార్డెన్స్, వైఎంసీఏ జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. ముఖ్య అతిథి, సీనియర్ క్రీడాకారుడు బండారు రాము విన్నర్స్ జీఆర్ గార్డెన్స్‌కు రూ.12 వేలు ప్రథమ బహుమతి, మెమెంటో అందజేశారు. షేక్ జాని, కంభంపాటి ఆనందరావు రన్నర్స్ వైఎంసీఏ జట్టుకు రూ.8 వేలు ద్వితీయ బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మన్నెం చంటి, రవి చౌట శ్రీను, కంభంపాటి శ్రీను, అంజి, బాజీ, శాంసన్ పాల్గొన్నారు.

వైభవంగా పునీత ఆంతోని చర్చి తిరునాళ్ల



తురకపాలెం(ముప్పాళ్ల): తురకపాలెం గ్రామంలోని పునీత ఆంతోని చర్చి 122వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం వైభవంగా జరిగింది. చర్చిని విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు సామూహిక ప్రార్థనలో పాల్గొన్నారు. ఆలయ విచారణ గురువు నాగోతు చిన్నయ్య దివ్య పూజ నిర్వహించారు. అనంతరం సమష్టి దివ్యపూజాబలి నిర్వహించారు. విచారణ గురువులు జోజి రాయన్న, మల్లవరపు సుందరబాబుతో పాటు మరో పది మంది గురువులు పాల్గొన్నారు. నాగోతు శౌరిరాజు ఫాదర్‌గా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జూబిలీ వేడుకలు నిర్వహించారు. కొవ్వొత్తుల సమర్పణ చేశారు. సాయంత్రం తేరు ఊరేగింపు వేడుకగా జరిగింది. గ్రామ సర్పంచ్ మల్లవరపు చంద్రశేఖర్ ప్రతాప్ చిన్నారులకు బహుమతులు అందించారు.

అఖిలేష్ యాదవ్ కుటుంబానికి

మాచర్లపై ఎనలేని అభిమానం

- ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే అషుమాలిక్
- అఖిలేష్ యాదవ్ పేరున్న చిన్నారులకు బహుమతులు అందజేత



బహుమతులు అందుకున్న చిన్నారులు, యూపీ ఎమ్మెల్యే అషుమాలిక్, యాదవ సంఘ నాయకులు

మాచర్ల: భారతదేశ చరిత్రలో మూడు సార్లు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన స్వర్గీయ ములాయం సింగ్ యాదవ్‌కు ఆంధ్రప్రదేశ్‌పై ఎనలేని ప్రేమ ఉందని, అందులో మాచర్లపై ప్రత్యేక అభిమానం చూపుతారని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, సహరాన్‌పూర్ సమాజ్ వాదీ జాతీయ పార్టీ ఎమ్మెల్యే అషుమాలిక్ అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయన మాచర్లను 1994లో పర్యటించారన్నారు. అదే స్ఫూర్తితో అఖిలేష్ యాదవ్ ఎనలేని ప్రేమ చూపుతున్నారన్నారు. అందులో భాగంగానే శుక్రవారం అఖిలేష్ యాదవ్ పేరు పెట్టుకున్న చిన్నారులకు బహుమతులు, మెమెంటోలు అందజేసి వారి తల్లిదండ్రులకు వీవీఎస్ గార్డెన్‌లో సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్లపై ప్రత్యేక అభిమానం వల్లనే తనను ఆయన ఇక్కడకు పంపారన్నారు. మాచర్ల పట్టణంలో అనేక మంది యాదవులు ములాయం సింగ్, అఖిలేష్ యాదవ్ పేర్లు పెట్టుకొని ఆయనను స్ఫూర్తి దాయకంగా తీసుకుంటున్నారన్నారు. దేవుళ్ల పేర్లు కాదని మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ పేరు పెట్టుకోవటం అభినందనీయమన్నారు. ఎక్కడో ఉత్తరప్రదేశ్‌లో ఉన్న అఖిలేష్ యాదవ్ తన పేరు పెట్టుకున్న కుటుంబాలన్నీ ఆనందంగా ఉండాలని 'నేను అఖిలేష్' అనే కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథిగా రావటం సంతోషంగా ఉందన్నారు. మాచర్ల ప్రాంతంలోని ప్రతి యాదవ కుటుంబానికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాజ్ వాదీ పార్టీ జాతీయ నాయకులు ఆంధ్రా, తెలంగాణ ఇన్‌చార్జి జగదీష్ యాదవ్, అఖిలేష్ యాదవ్ అభిమాన సంఘ ఉమ్మడి రాష్ట్ర ఇన్‌చార్జి బొట్టు మధు యాదవ్, ఉత్తరప్రదేశ్ సమాజ్ వాదీ పార్టీ నాయకులు షరీఫ్, కార్యక్రమ నిర్వాహకులు, అధ్యక్షులు గాదె రామకృష్ణారావు, బిసి సంఘ నాయకులు జింకల నాగేశ్వరరావు యాదవ్, యరగాని సాంబశివరావు యాదవ్, నర్రా సాంబశివరావు, రమేష్ యాదవ్, హరిబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 21న జాబ్ మేళా

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్, సీడాప్, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో ఈ నెల 21న మాచర్లలో ఎస్‌కేబీఆర్ కళాశాలలో జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ తమ్మాజీరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం స్థానిక ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించటం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రాంత యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాలో సుమారు నాలుగు కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఈ జాబ్ మేళాలో 10వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న 18 నుంచి 35 సంవత్సరాలలోపు యువతీ యువకులు బయోడేటా, సర్టిఫికెట్లు, పాసుపోర్టు ఫొటోతో నేరుగా హాజరు కావచ్చన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు ఆర్ కిరణ్ నాయక్ 7842747682, నైనిక్య 9010585360లను సంప్రదించాలన్నారు.

కష్టపడితే ప్రతిఫలం ఉంటుంది

వైఎస్సార్‌సీపీ దాచేపల్లి మండల కన్వీనర్ జాకీర్ హుస్సేన్



గాంధీని సత్కరిస్తున్న దాచేపల్లి, గురజాల నాయకులు

గురజాల : పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడూ ప్రతిఫలం ఉంటుందని దాచేపల్లి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షేక్ జాకీర్ హుస్సేన్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పల్నాడు జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడిగా సిద్దాడపు గాంధీకి పదవి రావడంతో గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కష్టకాలంలో అండగా ఉన్న ప్రతి ఒక్కరిని జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ సైదా, పి.బాబు, బొడ్డు నాగేశ్వరరావు, నాళం శ్రీను, యలగా నరసింహారావు, రామిరెడ్డి, కర్రా గిరిబాబు, కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, జక్కా రమణ, అంజి, జి.కోటేశ్వరరావు, గోపి తదితరులున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



వెల్దుర్తి : స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం 2025 హెచ్‌టీవీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించి అందరి మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌టీవీ న్యూస్ అధినేత మెట్రో శ్యామ్ దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపకులు రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్, జగ్జీవన్‌రామ్ చర్మకారుల సంక్షేమ సంఘం మాచర్ల పట్టణం మాజీ అధ్యక్షుడు కందుల రవికుమార్, కార్డ్స్ సంస్థ బాలబాట ఆర్‌సీఓ పేరుపోగు ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు జూలకంటి రాఘవరెడ్డి, పాస్టర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు

నేడు గంగాదేవీ తిరునాళ్లకు వేలం పాటలు

క్రోసూరు: అచ్చంపేట మండలం ఓర్వకల్లు గ్రామంలోని గంగాదేవీ పేరాంటళమ్మ ఆలయ తిరునాళ్ల ఫిబ్రవరి 12న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన లైసెన్సు హక్కుల వేలం పాట శనివారం నిర్వహిస్తున్నట్లు ఈవో ఎం.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో క్రోసూరులోని వీరభద్ర మల్లికార్జునస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. తిరునాళ్ల ఫిబ్రవరి 11 నుంచి 13వ తేదీ వరకు, నెల పొంగళ్లు మార్చి 13 నుంచి 15వ తేదీ వరకు ఈ లైసెన్సులు పొందుతారని తెలిపారు. కొబ్బరి చిప్పలు, భక్తులు సమర్పించే చీరలు, జాకెట్ల సేకరణ, లడ్డూ ప్రసాదం, పూజా సామగ్రి విక్రయం, రంగులరాట్నం, చెప్పుల స్టాండ్ నిర్వహణకు వేలం పాటలు జరుగుతాయని పేర్కొన్నారు. హిందువులు వేలం పాల్గొనాలని, చెప్పుల స్టాండ్‌కు రూ.వెయ్యి, ఇతర హక్కులకు రూ.10 వేలు ముందుగా డిపాజిట్ చెల్లించాలని, పాడుకున్న వారు వెంటనే నగదు చెల్లించాలని తెలిపారు.

ఆంగ్ల భాష సర్టిఫికెట్ కోర్సుకు ఎంపిక

క్రోసూరు: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఆంగ్ల భాష సర్టిఫికెట్ కోర్సుకు మండలంలోని అందుకూరు ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు (ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్) డి.ధర్మారావు ఎంపికైనట్లు ఆయన శుక్రవారం తెలిపారు. బెంగళూరులోని ఆర్‌ఐఈఎస్‌ఐలో నెల రోజులపాటు జరిగే శిక్షణకు రిలీవ్ ఆదేశాలను సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ (డీఈవో) ఎల్.చంద్రకళ ఇచ్చినట్లు వెల్లడించారు. జిల్లా నుంచి ఎంపికైన ఇద్దరు ఉపాధ్యాయుల్లో తాను ఒకడినని ధర్మారావు తెలిపారు.

ఇక డ్రోన్‌తో నిఘా

క్రోసూరు: జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ప్రతి రోజు మండలంలో రాత్రిళ్లు పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రరావు శుక్రవారం తెలిపారు. మండలానికి డ్రోన్ కేటాయించడం జరిగిందని, దాని ద్వారా సమస్యాత్మక ప్రాంతాల్లో రాత్రిళ్లు నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. రాత్రి దొడ్లేరు, బయ్యవరం, క్రోసూరులో పెట్రోలింగ్ చేపట్టి, క్రోసూరులో డ్రోన్ ఎగుర వేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

కమ్మేస్తున్న పొగ మంచు



ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకుండా కమ్మేసిన పొగమంచు



మంచుతో కప్పబడిన గురజాల

గురజాల మండలాన్ని పొగ మంచు కమ్మేస్తోంది. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు మంచు కురుస్తూనే ఉంటుంది. దట్టమైన పొగ మంచు కారణంగా కనీసం ఎదురుగా వస్తున్న మనిషులు, వాహనాలు కూడా కనిపించడం లేదు. దగ్గరగా వచ్చేంత వరకు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా సమయాల్లో అవసరాల నిమిత్తం బయటకు వెళ్లు వారు వాహనాలకు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి. మంచుతో పాటు చలి తీవ్రత కూడా పెరగడంతో ఉదయం, రాత్రి వేళల్లో జనం చలి మంట కాచుకుంటూ ఉపశమనం పొందుతున్నారు.

– గురజాల